రోడ్ సేఫ్టీపై అవగాహన

హఫీజ్‌పేట్ : మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్ద హెచ్‌సీఎస్‌సీ నిర్వహించిన రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారి భద్రతను పెంపొందించే ప్రయత్నంలో భాగంగా మేరు ఇంటర్నేషనల్ విద్యార్థులు, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) మద్దతుతో 'ట్రాఫిక్ షరిష్టే' కార్యక్రమం నిర్వహించారు. మేరు ఇంటర్నేషనల్ స్కూల్ సేఫ్టీ క్లబ్, రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్, పాదచారుల నియమాలను ప్రధాన రోడ్డుపై అవగాహన కల్పించారు. మైమ్ షోలో విద్యార్థుల నైపుణ్యం సృజనాత్మక ప్రదర్శనల ద్వారా, విద్యార్థులకు రహదారి ప్రవర్తనలో ప్రభావాన్ని ప్రదర్శిస్తూ కీలకమైన సందేశాలను ప్రజలకు అందించడం జరిగిందని స్కూల్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

సంక్రాంతి సందర్భంగా రంగోలి పోటీలు





రంగోళి పోటీల   విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి/మియాపూర్: కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ గాంధీ ఎస్టేట్, మియాపూర్ న్యూ కాలనీల్లో రంగోళీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన టి.వరలక్ష్మీ మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు రంగోళీ పోటీలు దోహదపడుతాయన్నారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దడం భారతీయ సనాతన సంప్రదాయం అన్నారు. ప్రతి కాలనీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అమ్మయ్య చౌదరి, విజయలక్ష్మీ, వరలక్ష్మీ, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీధర్, శ్రీనివాస్, శిరీష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప జాతీయమేళా లో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాట్యకల్ప కూచిపూడి డ్యాన్స్ అకాడమీ లక్ష్మీప్రసూన శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో తాండవ నృత్యకరి, గజానన, నటేశకౌతం, కోలాటం, కీర్తింతు, జతిస్వరం, బొమ్మబొమ్మ, తిల్లాన, జగదానందకారక, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు స్వాతి, చైత్ర, హేతుక, జెస్విత, శ్రీసహస్ర, సంయుక్త, శ్రీశ, మహిక, మహేసవి, రియంశు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గచ్చిబౌలి: రంగ వల్లులు, పతంగులు, బోగి మంటలతో కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో సంక్రాంతి సందడి నెలకొంది. ఈ సందర్భంగా భోగి పండ్లు పోసి విద్యార్థులను ఆశీర్వదించారు. రంగవల్లులు, పతంగులతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం బోగి మంటలు వేశారు. కార్యక్రమంలో సంస్కృతి పాఠశాలల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, సుబ్బలక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగ్గుల పోటీలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. విజేతలకు శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వి.రమ బహుమతులు అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.



సంస్కృతి హై స్కూల్‌లో భోగి మంటలు వేసిన దృశ్యం

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం

● యువకుడికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి గ్రామానికి చెందిన నవీన్(25) బుధవారం సాయంత్రం ముత్తంగి నుంచి కొండాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముత్తంగి పిస్తా హౌస్ సమీపంలోకి రాగానే వెనుకాల నుంచి వేగంగా వచ్చిన డీసీఎం నవీన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





చేనేత హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

సంక్రాంతి సందడి

- శిల్పారామంలో ఆకట్టుకుంటున్న గాంధీ శిల్ప జాతీయ మేళా
- చేనేత హస్తకళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన
- 17 వరకు కొనసాగనున్న మేళా
- 13న సంక్రాంతి సంబరాలు ప్రారంభం
- అలరించనున్న గంగిరెద్దులు బుడబుక్కలు, జంగమదేవరలు, పిట్టల దొరలు
- ప్రతిరోజు సాయంత్రం 5.30గంటలకు ఆంపిథియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



గంగిరెద్దుల విన్యాసాలు (ఫైల్)

మాదాపూర్: శిల్పారామంలో సంక్రాంతి సందడి ముందే వచ్చేసింది. ఈనెల 13 నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబురాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హరిదాసుల హరినామస్మరణతో, పిట్టలదొరలు పిట్టకథలతో, ఎరుకలసాని చెప్పే సోదిలతో, గంగిరెద్దుల ఆటలతో శిల్పారామం ఆవరణం అంతా కలియతిరిగి సందర్శకులను ఆకట్టుకోనున్నారు. హరిదాసుల సంకీర్తనలు, బుడబుక్కల జంగమదేవర గారడీ వేషాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. నటరాజ్ లాన్‌లో భోగి పండుగ సందర్భంగా భోగిపళ్ల ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శిల్పారామం అధికారులు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బొమ్మల కొలువు ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత ఉత్పత్తులు

చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప జాతీయ మేళాలో భాగంగా కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఫోక్ పెయింటింగ్, బస్తర్ ఐరస్‌క్రాఫ్ట్, జారీ జర్దోసీ, జ్యూయలరీ, హ్యాండ్‌ప్రింటెడ్ డ్రెస్ మెటీరియల్స్ , వివిధ రకాల చీరలు, టెర్రకోట, లేస్‌వర్క్, టై అండ్ డై, బిద్రిక్రాఫ్ట్ , సీతల్‌పట్టి, బాంబు, సిల్వర్ పిలిగ్రి, బొమ్మలు, డ్రైప్లవర్స్‌లు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈనెల 17 వరకు ఈ మేళా కొనసాగనున్నట్లు తెలిపారు. సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాయంత్రం ఆంఫిథియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నారు. ఇందులో కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, ఒడిస్సీ, సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖామంత్రి, రంగారెడ్డిజిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రికి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నిధులు మంజూరు చేయిస్తామని హమీ ఇచ్చారు. జిల్లా మంత్రి పర్యవేక్షణలో నిధులు మంజూరు చేస్తారని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జీలను సమన్వయ పరుస్తూ ముందుకు సాగుతామని మంత్రి పేర్కొన్నారని ఆయన వివరించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జలమండలి డీజీఎం నాగప్రియను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మయూరినగర్‌లోని జలమండలి కార్యాలయంలో డీజీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పాత పైప్‌లైన్ స్థానంలో మంచినీటి పైపులైన్‌లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలన్నారు. కాలనీలు, బస్తీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ సునితా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కిరణ్, నర్సింహ తదితరులున్నారు.

వేతనం అందజేత

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజకుమారి పాఠశాలలో అదనంగా ఇద్దరు ఉపాధ్యాయులు, వాచ్‌మెన్ కావాలని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ సత్యం శ్రీరంగం ఇద్దరు ఉపాధ్యాయులను, వాచ్‌మెన్‌ను నియమించారు. ఇచ్చిన మాట ప్రకారం వారికి డిసెంబర్ నెల జీతాన్ని గురువారం కార్యాలయంలో అందజేశారు.

ముగిసిన వార్షిక క్రీడా పోటీలు



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న కమాండెంట్ సన్నీ తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వబెటాలియన్ బి కంపెనీ వార్షిక క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు కమాండెంట్ సన్నీ ట్రోఫీలు, బహుమతులను ప్రదానం చేశారు. బెటాలియన్‌లోని పోలీసులకు ఆటవిడుపు కోసం బెటాలియన్ మైదానంలో రెండు రోజుల పాటు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం విధుల్లో బిజీగా ఉండే వారికి ఆటవిడుపు కోసం క్రీడా పోటీలను ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్స్ దేవిదాస్‌రాథోడ్, నర్సింహ్మాస్వామి, రహమాన్, డి సత్యనారాయణ, కంపెనీ కమాండర్ ఎస్‌వి ఆదినారాయణరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: డివిజన్‌లోని సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులతో కలసి కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో గురువారం కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోనే రెండో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. తన గెలుపులో బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శాఖయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ ఉపచైర్మన్ మందడి సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు కీలకపాత్ర వహించారని గుర్తు చేశారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అభివృద్ధికి మారుపేరుగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామన్నారు. ఇకపై పార్టీలు ఏమైనా అభివృద్ధే ఎజెండాగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ప్రాణం ఉన్నంత వరకు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలను కాపాడుకుంటానని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కృషి చేయాలని కోరారు.

వడ్డెర కులస్తుల ఆరాధ్య దైవం వడ్డె ఓబన్న

వడ్డెర కులస్తుల ఆరాధ్య దైవం వడ్డె ఓబన్న జయంతిని గురువారం వడ్డెర కులుస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డెర కులుస్తుల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాగర కృష్ణ, బండారి శ్రీనివాస్, రాజు, బి. లక్ష్మణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

రాయిన్‌చెరువు పరిశీలన



నాయకులు, మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని రాయిన్‌చెరువు మధ్యలో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన కంచెతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జెడ్పీ సమావేశంలో వైస్ చైర్మన్ ప్రభాకర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కలెక్టర్ క్రాంతి.. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం జిల్లా ఫారెస్టు అధికారి శ్రీధర్ రావు, ఇరిగేషన్ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఫిషరీస్ అధికారి సతీష్ చెరువును సందర్శించారు. కంచె వల్ల ఇబ్బంది పడుతున్నామని మత్స్యకారులు వారి దృష్టికి తీసుకువచ్చారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మంద రమేశ్, గాండ్ల శ్రీనివాస్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ◆ హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పిటల్, మల్లన్న టెంపుల్ ఏరియాలు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- ◆ ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

జర భద్రం..

- సంక్రాంతికి ఊరెళితే జాగ్రత్త
- పీఎస్‌లో సమాచారం ఇవ్వాలి
- విలువైన వస్తువులను లాకర్‌లో పెట్టుకోవాలి
- మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్



మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ అన్నారు. అప్రమత్తతోనే దొంగతనాల నివారణ సాధ్యమన్నారు. ఊరు వెళ్లే వారు ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటి ఆవరణను కవర్ చేసే విధంగా సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. విలువైన ఆభరణాలు, నగదు బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని లేదా వెంట తీసుకెళ్లాలన్నారు. ఊరు వెళుతున్నట్లు సంబంధిత పీఎస్‌లో సమాచారం ఇస్తే పెట్రోల్ మొబైల్ నిఘా పెట్టేందుకు వీలుంటుందన్నారు. పక్కంటి వాళ్లు ఊరెళితే ఎవరు వస్తున్నారో ఇరుగు పొరుగు వారు గమనించాలని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, దొంగలు చోరీలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా శ్రీ చైతన్య స్కూల్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు మెడల్స్ అందజేసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వాణి తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్‌లో స్పోర్ట్స్ డే గురువారం ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆటలతో పాటు క్రీడలపైకూడ శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణి, ఏ టూ జడ్ అకాడమీ ఫౌండర్, కోచ్ ఈశ్వర్‌రెడ్డి, శ్రీ చైతన్య స్కూల్ డీన్ నాగరాజు, ప్రైమరీ ఇన్‌చార్జి అమల తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

పటాన్‌చెరు టౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి రాములు అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నందన్ రతన్ ఫ్రైడ్ కాలనీలోని ఓ టీషాప్, మెకానిక్ షాప్ వద్ద ఇద్దరు బాల కార్మికులు పనిచేయడాన్ని గుర్తించారు. ఆ దుకాణాల యజమానులపై పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నటి తేజస్విని, నిర్వాహకుడు డొమినిక్ తదితరులు



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి తేజస్విని నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ప్రత్యేక జ్యువెలరీ, పండుగ సందర్భంగా వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇస్నాపూర్ సరిత వైన్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సురేందర్ సింగ్(బీహార్ వాసి) నాలుగేళ్ల క్రితం ఇస్నాపూర్‌కు వచ్చి వైన్స్‌లో పని చేసుకుంటూ, వైన్స్ వెనకాల ఓ గదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అనారోగ్యంగా ఉండటంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్లాక్‌లో 'గుంటూరు కారం'టికెట్లు

● పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

గచ్చిబౌలి: హీరో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమా రిలీజ్‌కు ముందే బ్లాక్‌లో టికెట్లు అమ్ముతూ ముగ్గురు యువకులు పోలీసులకు చిక్కారు. గురువారం రాత్రి కొత్తగూడలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని ఏఎంబీ సినిమాస్‌లో గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన చైతన్య యశ్వంత్, ఆదిత్య గుంటూరు కారం సినిమా టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. రూ.410 టికెట్‌ను రూ.2500కు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 236 సినిమా టికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జేమ్స్ బాబు తెలిపపారు.నిందితులకు 41 నోటీసులు అందించామని, సినిమా టికెట్లు ఎలా సంపాదించారో విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.